సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం ∙ 8 ∙ అక్టోబర్ ∙ 2025



కిలో టమాట రూ.22

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.



టన్ను చీనీ రూ.15 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
34.9°/21.1°

జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రేపు కోల్‌కతా హైకోర్ట్ జడ్జి రాక

ప్రశాంతి నిలయం: కోల్‌కతా హైకోర్ట్ జడ్జి అరిజిత్ బెనర్జీ ఈ నెల 9న పుట్టపర్తికి రానున్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన ఆయన పుట్టపర్తికి వస్తారని డీపీఆర్‌ఓ తెలిపారు. పుట్టపర్తిలోని సాయిట వర్స్ హోటల్‌లో బస చేయనున్నట్లు తెలిపారు. పదో తేదీన ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారని వెల్లడించారు.

రాష్ట్ర స్థాయిపోటీలకు శిరివరం విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం తదితరులు

లేపాక్షి: శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఇద్దరు రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.మైత్రి 69 కేజీల విభాగంలో ప్రథమ స్థానం, మరో విద్యార్థిని గౌతమి 58 కేజీల విభాగంలో మూడో స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్, ఫిజికల్ డైరెక్టర్ సంపత్‌కుమార్ మంగళవారం తెలిపారు. మంగళగిరిలో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను మంగళవారం ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

10 నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

ధర్మవరం అర్బన్: నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ నెల పదో తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్ చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.కోట్లలో బిల్లులు రావాలని, వాటిని చెల్లించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని పేర్కొన్నారు. ఏడాది కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని తెలిపారు. అందుకే శుక్రవారం నుంచి వైద్యసేవలు బంద్ చేయాలని నిర్ణయించామని వెల్లడించారు.

డైట్ కళాశాలకు గ్రాంట్ విడుదల


అనంతపురం ఎడ్యుకేషన్: బుక్కపట్నంలోని డైట్ కళాశాలకు 2025–26 సంవత్సరానికి సంబంధించిన గ్రాంట్ విడుదల చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు పద్దుల కింద మొత్తం రూ.9. 90 లక్షలు విడుదల చేశామన్నారు. ఇందులో 50 శాతం వార్షిక గ్రాంట్ రూ. 7.50 లక్షలు, టెక్నాలజీ సపోర్ట్ కింద రూ. 2.40 లక్షలు ఉన్నాయన్నారు. నిబంధనలకు లోబడి ఖర్చు చేసి వివరాలను టీసీఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

'చైతన్య జ్యోతి'కి సిల్వర్ జూబ్లీ శోభ



విద్యుత్ వెలుగుల్లో చైతన్య మ్యూజియం

ప్రశాంతి నిలయం: విదేశాల నుంచి పుట్టపర్తికి వచ్చే పర్యాటకులకు సత్యసాయి చరిత్రను కళ్ల ముందు సాక్షాత్కరింపజేస్తోంది చైతన్య జ్యోతి మ్యూజియం. చైనీస్ నిర్మాణ రీతిలో రూపుదిద్దుకున్న ఈ మ్యూజియం సత్యసాయి 75వ జన్మదినం సందర్భంగా ప్రారంభించారు. ప్రస్తుతం సత్యసాయి శత జయంతి నాటికి 25 వసంతాలకు చేసుకుంది. ఈ సందర్భంగా చైతన్య జ్యోతి మ్యూజియాన్ని ఇటీవల పునరుద్ధరించారు. విద్యుత్ దీపపు కాంతులు, పెయింటింగ్స్‌తో పాటు సత్యసాయి శత జయంతి వైభవాన్ని చాటే పలు ఘట్టాలతో నిర్మాణాలు చేపట్టారు. మలేషియా భక్తులు పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు. సత్యసాయి శత జయంతి మరో 47 రోజుల ఉండగా, చైతన్య జ్యోతి మ్యూజియం తన సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించుకుని.. జయంతి వేడుకలకు తరలివచ్చే భక్తులను కనువిందు చేసేందుకు సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం మ్యూజియంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ సిబ్బంది సంబరాలు చేసుకున్నారు.



అంగట్లో అంగన్‌వాడీ పోస్టులు

- కొత్తచెరువు మండలంలో ఇటీవల అప్‌గ్రేడ్ చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఇప్పిస్తామంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక ద్వితీయశ్రేణి నాయకుడు ఒక్కొక్కరి దగ్గర రూ.2 లక్షల నుంచి రూ.3.50 లక్షల దాకా వసూలు చేశారు. ఈ విషయం ఆ పార్టీకి చెందిన వారే తెలిపారు. అదీ ఒకే కేంద్రానికి ఇద్దరు, ముగ్గురు నుంచి డబ్బు తీసుకున్నారు. 'ఒకవేళ రోస్టర్‌లో ఓసీ బదులు బీసీ లేదా ఇంకేదైనా కులానికి కేటాయిస్తే అప్పుడెలా'? అని డబ్బులిచ్చిన వారు అడిగితే.. 'ఖర్చులు పట్టుకొని మిగతాది పువ్వుల్లో పెట్టి తిరిగి ఇచ్చేస్తాం. అనుమానం పెట్టుకోవద్దు' అంటూ సదరు నాయకులు సమాధానమిస్తున్నారు.
- ధర్మవరం నియోజకవర్గంలో ఓ వైపు బీజేపీ, మరో వైపు టీడీపీ నాయకులు అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఇప్పిస్తామంటూ వ్యాపారం మొదలు పెట్టారు. ఈ విషయంలో ముదిగుబ్బ మండలంలోని ఓ గ్రామంలో ఇరుపార్టీ నాయకుల మధ్య చిన్నపాటి గొడవ కూడా జరిగింది. మంత్రి సత్యకుమార్ ఇచ్చిన జాబితానే ఫైనల్ అని బీజేపీ నాయకులంటే.. కాదు కాదు పరిటాల ఫ్యామిలీదే జరుగుతుందని టీడీపీ వారు.. ఇలా ఇరువర్గాల వాదనలు రచ్చకెక్కాయి.

– ఇలా ఒకటి కాదు.. రెండు కాదు జిల్లాలోని అన్ని మండలాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టుల పేరుతో దందా మొదలైంది. ఆశావహులు చాలామంది అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ పోస్టు కోసం డబ్బులివ్వక తప్పడం లేదు.

- జిల్లాలో 548 మినీ అంగన్‌వాడీలు మెయిన్ కేంద్రాలు అప్‌గ్రేడ్
- ఒక్కో కేంద్రానికి ఒక ఆయా పోస్టు మంజూరు
- త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్న కలెక్టర్
- అప్పుడే వ్యాపారం మొదలుపెట్టిన 'పచ్చ' మంద
- ఒక్కో పోస్టుకు రూ.4 లక్షల దాకా వసూలు

కదిరి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జిల్లాలో ప్రధానంగా టీడీపీ నాయకులు కొందరు రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఇది సక్రమ వ్యాపారమైతే పర్వాలేదు. అంతా అక్రమ వ్యాపారమే. ఇసుక, మట్టి, మద్యం ఇలా దేన్నీ వదలడం లేదు. తాజాగా కొత్త వ్యాపారం మొదలెట్టారు. అదే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల బిజినెస్. ఒక్కో పోస్టుకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఆ రేటు మరింత పెరిగే అవకాశం లేకపోలేదని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. జిల్లాలోని 548 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఈ మధ్యే అప్‌గ్రేడ్ చేశారు. వీటికి ప్రస్తుతం ఒక్కొక్కరు చొప్పున అంగన్‌వాడీ సహాయకురాలు (ఆయా) అవసరం. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం నుంచి అనుమతులు కూడా వచ్చాయి. దీనికి సంబంధించి రోస్టర్ ప్రక్రియ పూర్తి కాగానే కలెక్టర్ శ్యాంప్రసాద్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అయితే జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టుల కోసం ఆశావహులు స్థానిక ఎమ్మెల్యేల ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీన్ని గ్రహించిన కొందరు ద్వితీయ శ్రేణి టీడీపీ నాయకులు 'ఆ పోస్టు ఎలాగైనా మీకే వచ్చేలా చేస్తాం. పోటీ ఎక్కువగా ఉంది. అయినా మీకే ఇప్పిస్తాం. కాకపోతే డబ్బులు ముందే ఇవ్వాలి. ఎన్నికల్లో డబ్బు తీసుకోకుండా ఓటు వేయలేదు కదా.. ఎంతో కొంత రాబట్టుకోవాలి..' అంటూ రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా వసూలు చేస్తున్నారు. సరాసరిన ఒక్కో పోస్టుకు రూ.3 లక్షలు అనుకున్నా రూ.16 కోట్లు పైమాటే. ఈ తంతు కొన్ని నియోజవర్గాల్లో ఎమ్మెల్యేకు తెలిసి జరుగుతుంటే.. ఇంకొన్నిచోట్ల ఆయా ఎమ్మెల్యే పీఏల కనుసన్నల్లో సాగుతోంది.

అప్‌గ్రేడ్ పేరుతో మరో వ్యాపారం

జిల్లాలో ఉన్న ఇంకా 70 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వీటిలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు 10వ తరగతి ఉత్తీర్ణత లేనందున ఆయా కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయలేదు. దీన్ని కూడా స్థానిక టీడీపీ నాయకులు కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అప్‌గ్రేడ్ చేయించి మిమ్మల్నే కొనసాగిస్తాం అంటూ కొందరు, ఆ స్థానంలో వారు కాకుండా మీకు అవకాశం కల్పించే బాధ్యత మాది.. అంటూ మరి కొందరు ఇలా వారిని నమ్మిస్తూ అంగన్‌వాడీ పోస్టును అంగట్లో అమ్మకానికి పెట్టారు. కొన్ని చోట్ల రూ.6 లక్షలు వరకు డిమాండ్ చేస్తున్నారని సమాచారం. అలాగే ఇవన్నీ అప్‌గ్రేడ్ అయితే ఆయా(సహాయకురాలు) పోస్టుకు ముందే డబ్బు కట్టి రిజర్వ్ చేసుకోండి.. అంటూ కొన్ని చోట్ల డబ్బు తీసుకున్నారు.

వసూళ్ల పార్టీ



టీడీపీని వసూళ్ల పార్టీ అంటే సరిపోతుంది. ఇసుక, మట్టి ఇలా దేన్నీ వదలడం లేదు. ప్రజలు ఏదైనా సమస్యతో పోలీస్ స్టేషన్‌కు గానీ, లేదంటే ఏ ప్రభుత్వ కార్యాలయానికి గానీ వెళ్లినా అక్కడే కాచుకొని ఉన్న 'పచ్చ' పార్టీ నాయకులు 'అధికారులతో మీ పని మేం చేయిస్తాం' చెప్పి డబ్బు గుంజుతున్నారు. ఇప్పుడు అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఇప్పిస్తామంటూ పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యేలకు తెలిసే ఈ తంతు జరుగుతోంది. – **ఉషశ్రీచరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ**

డబ్బులిచ్చి మోసపోవద్దు



అంగన్‌వాడీ ఆయా పోస్టుల కోసం నాయకులకు గానీ, లేదంటే ఐసీడీఎస్ ఉద్యోగులకు గానీ ఎవ్వరూ డబ్బులు ఇవ్వకండి. ఉద్యోగం రాకపోతే మేము బాధ్యులం కాదు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నియామకాలు పారదర్శకంగా జరుగుతాయి. దీనికి త్వరలోనే నోటిఫికేషన్ విడుదలవుతుంది. డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తప్పవు. – **ప్రమీల, పీడీ, ఐసీడీఎస్**

జిల్లాలో ఐసీడీఎస్ గణాంకాలు

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	12
అంగన్‌వాడీ కేంద్రాలు	2,824
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	618
అప్‌గ్రేడ్ చేసిన కేంద్రాలు	548



ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం



వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళర్పిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్: రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ఫంక్షన్ హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు హాజరై వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి ర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీతారాముల సద్గుణాలు, గొప్పతనం, కుటుంబ విలువల నుంచి పాలన సూత్రాల వరకు సమాజ శ్రేయస్సుకు అవసరమైన ఎన్నో విషయాలను రామాయణం ద్వారా వాల్మీకి మహర్షి తెలియజేశారన్నారు. మహనీయుల అడుగు జాడల్లో నడిచి తమ జీవిత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మినారాయణ, జిల్లా అధ్యక్షులు గంగన్న, సాధికారత సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



అనంతపురం సిటీ: స్థానిక ఆర్డీటీ స్టేడియం సమీపంలో ఉన్న ఎకాలజీ సెంటర్‌లో పంచాయతీ కార్యదర్శులకు బుధవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య మంగళవారం తెలిపారు. ఒక్కో మండలం నుంచి ఒక్కో కార్యదర్శి శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు (మూడు రోజుల పాటు) శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. శిక్షణ తరగతులను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రారంభిస్తారని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు.

లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రశాంతి నిలయం: గృహ నిర్మాణ శాఖ లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ శ్యాంప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గృహనిర్మాణ సంస్థ అధికారులతో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా ఇంటి స్థలాలు లేని వారు, స్థలం ఉండి ఇల్లు మంజూరు అయినా కట్టని వారి జాబితాలు వెంటనే సిద్ధం చేయాలన్నారు. రామగిరి, కదిరి అర్బన్, గోరంట్ల, ధర్మవరం అర్బన్, పెనుకొండ, సోమందేపల్లి, కనగానపల్లి మండలాల్లో జీరో పురోగతి ఉందని, వారి పని తీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తయిన ప్రతి ఇంటికీ మరుగుదొడ్ల నిర్మాణం తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ధర్మవరం డీఈ లక్ష్మినారాయణమ్మ, పుట్టపర్తి, రాప్తాడు, పెనుకొండ, ధర్మవరం ఈఈలు శ్రీనివాసులు, శంకర్‌లాల్‌నాయక్, శివ కుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి

ప్రశాంతి నిలయం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 15 బహుళజాతి కంపెనీలతో ఈ నెల 10న హిందూపురంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేశారు. హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ ఎంబీఏ కాలేజీలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ, పీజీ, బీటెక్ చదివి 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 96767 06976, 99594 16770 నంబర్లలో సంప్రదించాలన్నారు.



గృహనిర్మాణ శాఖ ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

'డబ్బు'ల్ రిజిస్ట్రేషన్‌తో రూ.3 కోట్ల భూమికి ఎసరు!



కబ్జా చేసిన స్థలంలో ముకుందా అనే పేరుతో బోర్డు నాటిన దృశ్యం

- కనగానపల్లి మాజీ ఎంపీపీ భర్త ముకుందనాయుడి బరితెగింపు
- టీడీపీ ఎమ్మెల్యేల అండతో రెచ్చిపోతున్న వైనం

అనంతపురం టౌన్: అధికార అండతో 'పచ్చ' నేతలు బరితెగిస్తున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని 'డబ్బు'ల్ రిజిస్ట్రేషన్లతో భయకంపితులను చేస్తున్నారు. కూటమి ఏడాదిన్నర పాలనలో అనంతపురం నగరం చుట్టూ ఇదే తంతు సాగుతోంది. ఇప్పటికే నగరంలో సాయినగర్‌లోని 'అస్రా' ఆప్టికల్స్ భవనం, తపోవనంలోని ఎంకేఎం ఫంక్షన్ హాలు సమీపంలో 5వ రోడ్డులోని ఓ సామాజిక వర్గానికి చెందిన స్థలాల కబ్జాలు మరువక ముందే తాజాగా ఓ టీడీపీ నేత అనంతపురం రూరల్ మండలం ఏ. నారాయణపురం సమీపంలోని సర్వే నంబర్ 156–2లో రూ.3 కోట్ల విలువ చేసే 1.19 ఎకరాలకు ఎసరు పెట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ సరిపూటి పద్మాగీత భర్త సరిపూటి ముకుందనాయుడు నడిపిన అడ్డగోలు బాగోతం కలకలం సృష్టిస్తోంది. వివరాలు.. ఏ. నారాయణపురం గ్రామానికి చెందిన పెద్ద నారప్పకు గ్రామ సర్వే నంబర్ 156–2లో 9.59 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని అతనితో పాటు వారసులు దశల వారీగా 1999లో 3 ఎకరాలు, 2002లో 2.40 ఎకరాలు, 2008లో మిగిలిన 5 ఎకరాలను విక్రయించేశారు. ఇదే సర్వే నంబర్‌లో 1999లో 3 ఎకరాలు కొనుగోలు చేసిన వ్యక్తి నుంచి ఒక ఎకరా స్థలాన్ని మూడో రోడ్డుకు చెందిన కవ్వలూరు కృష్ణ 2009లో కొనుగోలు చేశాడు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ.3 కోట్లు పలుకుతోంది.

అధికార అండతో కబ్జా

కూటమి ప్రభుత్వం వచ్చాక కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పద్మాగీత, ఆమె భర్త ముకుందనాయుడు ఆ భూమిపై కన్నేశారు. టీడీపీ ప్రజాప్రతినిధుల అండతో 2025 ఆగస్టు 6న 'డబ్బుల్' రిజిస్ట్రేషన్ చేసుకుని భూమిలో బోర్డు నాటారు. ఇదేమని ప్రశ్నించిన నిజమైన భూ యజమానులను వేధింపులకు గురిచేస్తున్నారు.

వారికి ప్రధాన అనుచరుడు..

కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన ముకుందనాయుడు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ప్రధాన అనుచరుడు కావడం గమనార్హం. గతంలో ఆయన భార్య పద్మాగీత టీడీపీ తరఫున ఎంపీటీసీ సభ్యురాలిగా ఎన్నికై కనగానపల్లి ఎంపీపీగా పని చేశారు. 2024 ఎన్నికల తర్వాత అనంతపురానికి మకాం మార్చి నగర ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ తమకు సమీప బంధువు అంటూ హల్‌చల్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే మూడో రోడ్డుకు చెందిన కృష్ణ అనే బ్రాహ్మణుల ఎకరా భూమి కబ్జా చేయడం గమనార్హం. తమ పేర్లు చెప్పి కబ్జా చేస్తున్న విషయం ఆ ఎమ్మెల్యేలకు తెలుసా? లేదంటే తెలిసి కూడా తెలియనట్లు వ్యవహరిస్తున్నారా అన్న విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



పరిటాల సునీతతో ముకుందనాయుడు

మసిపూసి.. మారేడు కాయ చేసి!

- శిశు మరణంపై సాక్ష్యాలు తారుమారు?
- ఇప్పటి వరకూ బయటపెట్టని సీసీ కెమెరా ఫుటేజీలు
- గతంలోనూ ఇదే తరహాలో కీలక ఫైళ్ల మాయం

అనంతపురం సెంట్రల్: మహిళాశిశు సంక్షేమశాఖ పరిధిలోని శిశుగృహ అవినీతికి కేరాఫ్‌గా మారింది. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడడమే కాకుండా సాక్ష్యాలను సైతం తారుమారు చేయడంలో సిద్ధహస్తులనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. తాజాగా నవజాత శిశువు మృతి విషయంలోనూ సాక్ష్యాలు తారుమారు చేస్తున్నట్లు మహిళాశిశు సంక్షేమ శాఖలోని కొందరు అధికారులే బాహాటంగా పేర్కొంటున్నారు. శిశువు మృతి చెందిన రోజు ఏం జరిగిందనే విషయంపై సీసీ కెమెరా ఫుటేజీలు నేటికీ బయటపెట్టక పోవడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఒకసారి.. రికార్డు కావడం లేదని మరోసారి పొంతనలేని సమాధానాలతో విచారణాధికారులను సైతం పక్కదోవ పట్టించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 3న శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రికి తీసుకెళ్లామని, అక్కడ శిశువు మృతి చెందినట్లుగా సిబ్బంది బుకాయిస్తున్నారు. వాస్తవానికి శిశుగృహలోనే శిశువు మృతి చెందాడని, ఈ విషయం తెలిస్తే ఇబ్బందులు తప్పవని భావించిన శిశుగృహ సిబ్బంది సీసీ కెమెరా ఫుటేజీలను బయటపెట్టకుండా విచారణాధికారులను పెడదోవ పట్టిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



గతంలోనూ తిమ్మిని బమ్మిని చేసి..

గతంలోనూ దత్తత అంశంలో తలెత్తిన వివాదంలో సాక్ష్యాలను తారుమారు చేసినట్లుగా శిశుగృహ సిబ్బందిపై ఆరోపణలున్నాయి. కెనడా దేశానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ మహిళ దత్తత కోసం రాగా ఆమె నుంచి తొలుత రూ. 3 లక్షలు... ఆ తర్వాత బంగారాన్ని డిమాండ్ చేయడాన్ని ఆక్షేపిస్తూ కేంద్ర రాయబార కార్యాలయానికి ఆమె లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ వీరపాండియన్ తక్షణ విచారణ చేపట్టి వాస్తవాలు నిర్ధారించుకున్న అనంతరం శిశుగృహ మేనేజర్‌ను విధుల నుంచి తొలగించారు. అయితే సదరు ఎన్‌ఆర్‌ఐ మహిళ ఫిర్యాదులను, కలెక్టర్ జారీ చేసిన టెర్మినేట్ ఉత్తర్వులకు సంబంధించిన ఫైల్స్‌లో కొన్ని మాత్రమే ఉంచి కీలకమైన సమాచారాన్ని మాయం చేశారు. ఫలితంగా కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో తిరిగి మళ్లీ అదే స్థానానికి మేనేజర్ చేరుకున్నారు. ఎన్‌ఆర్‌ఐ ఫిర్యాదుతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం వెంటనే సెంట్రల్ అడాప్షన్ రిసోర్సు అథారిటీ(కారా) వెబ్‌సైట్ ద్వారా దత్తత పొందేలా మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేసింది. అంతకు మునుపు ఆఫ్‌లైన్ విధానంలో ఇష్టానుసారంగా దత్తతకు ఇచ్చి భారీగానే సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

శిశుగృహ మేనేజర్ ఏం చేస్తున్నట్లు?

శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారుల సంరక్షణ బాధ్యత మొత్తం సంబంధిత మేనేజర్‌పైనే ఉంటుంది. ఇబ్బందికర పరిస్థితుల్లోనైనా 24 గంటలూ సేవలందించాల్సి ఉంటుంది. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో చిన్నపిల్లల వైద్యులతో చికిత్సను అందించాలి. అవసరమైతే అక్కడే అడ్మిట్ చేయడం.. ప్రత్యేకంగా ఆయాను నియమించి కోలుకునేంత వరకూ చికిత్సనందించేలా చర్యలు తీసుకోవాలి. ఇందుకు విరుద్ధంగా ఇటీవల శిశువు మృతి చెందే వరకూ కూడా మేనేజర్ పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. 3న అర్ధరాత్రి విధుల్లో ఉన్న ఒకే ఆయా శిశువు పరిస్థితిని ఫోన్ ద్వారా తెలిపినా మేనేజర్ స్పందించలేదని తెలిసింది. దీంతో ఐదుగురు చిన్నారులను వదిలేసి శిశువును తీసుకుని సర్వజనాస్పత్రికి ఆయా ఒక్కరే వెళ్లింది. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించి వెనక్కు పంపినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

అక్రమాలకు అధికారి అండ!

శిశువు మరణానికి బాధ్యులైన వారిని రక్షించేందుకు ఓ అధికారి విశ్వప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. గతంలో అక్రమాలకు పాల్పడి టెర్మినేట్ అయిన సమయంలో అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి తిరిగి శిశుగృహలో బాధ్యతలు స్వీకరించేలా చేసిన సదరు అధికారి ప్రస్తుతం కూడా అవినీతి అధికారిని రక్షించే బాధ్యతలను భుజాన వేసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా శిశువు శిశుగృహలోనే మృతి చెందిన అంశాలున్న సీసీ కెమెరా ఫుటేజీలను తొక్కిపెట్టించినట్లు ఆరోపణలున్నాయి. అనారోగ్యంతో శిశువు మృతి చెందినట్లుగా మెడికల్ సర్టిఫికెట్ సృష్టించే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

పశు వైద్యంపై నిర్లక్ష్యం

మూగజీవాల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అత్యవసర సమయాల్లో పశువులు, జీవాలకు చికిత్స అందించే వైద్యుల పోస్టుల భర్తీ చేపట్టకపోవడంతో పశు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఈ క్రమంలోనే పశు సంవర్ధక ద్వారా అమలు చేస్తున్న పథకాలకూ దిక్కు లేకుండా పోయింది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి.

- సిబ్బంది కొరతతో ఆగిన సేవలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఇబ్బందుల్లో పాడి రైతులు


సిబ్బంది లేక మూతబడిన బుక్కపట్నంలోని పశువుల ఆస్పత్రి


ప్రైవేట్ వ్యక్తులతో గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న కాపర్లు

పుట్టపర్తి: పాడి పరిశ్రమను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. జిల్లాలోని పశువుల ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలో అంతులేని నిర్లక్ష్యం కనబరుస్తోంది. ఫలితంగా పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యసర సమయంలో వైద్యం అందక పశువులు, గొర్రెలు, కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పాడి రైతులకు అన్ని విధాలుగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని, పశు సంవర్ధక శాఖ ద్వారా పథకాలను సకాలంలో అందజేస్తూ పాడి రైతుల ఆర్థిక బలోపేతానికి కృషి చేశారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాడి రైతులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 60.88 లక్షలకు పైగా మూగజీవాలు

జిల్లా వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు, గేదెలు కలిపి 3,33,132 వరకు ఉన్నాయి. మేకలు 4.29 లక్షలు, గొర్రెలు 30.49 లక్షలు, కోళ్లు 22.77 లక్షలు, పందులు 1,727 ఉన్నాయి. వీటన్నంటికీ చికిత్స అందించేందుకు ప్రస్తుతం జిల్లాలో సిబ్బందితో పాటు మందులకొరత తీవ్రంగా వేధిస్తోంది. బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లోని పశు వైద్యశాలలో ఒక్క డాక్టర్ కూడా లేరు. దీంతో పశు వైద్య సేవలు ఆగిపోయాయి. ఆవులకు కృత్రిమ గర్భధారణ వ్యాక్సిన్, గాలికుంటు తదితర వ్యాధుల నివారణ టీకాలు అందుబాటులో లేక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జబ్బు బారిన పడిన పశువులు, జీవాలకు ప్రైవేట్‌గా చికిత్స చేయించుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

గత ప్రభుత్వంలో తిరుగులేని ప్రోత్సాహం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... పాడితోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని నమ్మి సాగుతో పాటు పాడి పోషణపై ప్రత్యేక దృష్టి సారించారు. రాయితీతో పశు దాణా అందించారు. పశువైద్యాన్ని మరింత మెరుగు పరచారు. అత్యవసర సమయంలో పశువులను వైద్యశాలలకు తరలించి నాణ్యమైన చికిత్సలు అందించేందుకు వీలుగా ప్రత్యేకంగా అంబులెన్స్‌లను సమకూర్చారు. వైద్య పరీక్షల కోసం ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఉచిత బీమాతో పాడి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడమే కాక... అమూల్ సంస్థ ద్వారా పాలకు గిట్టుబాటు ధర కల్పించారు. వీటికి భిన్నంగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అమూల్ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసి పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి గండికొట్టింది. సబ్సిడీ దాణాను ఇప్పటి వరకూ అందించిన దాఖలాలు లేవు. ఉచిత బీమా పథకానికి మంగళం పాడింది. పశు వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా మొత్తానికి పశు వైద్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా అడుగులేస్తోంది.

జిల్లాలో ఆస్పత్రుల వివరాలు

వెటర్నరీ పాలీక్లినిక్	1
వెటర్నరీ ఆస్పత్రులు	15
వెటర్నరీ డిస్పెన్సరీలు	66
గ్రామీణ పశు సంవర్ధక యూనిట్లు	23

సిబ్బంది వివరాలు..

హోదా	మొత్తం పోస్టులు	ఖాళీలు
అసిస్టెంట్ డైరెక్టర్లు	19	02
అసిస్టెంట్ సర్జన్లు	72	32
వెటర్నరీ అసిస్టెంట్లు	59	34
పశు సహాయకులు	348	31

పాడి ఆవులు చనిపోతున్నాయి



జబ్బు బారిన పడిన పాడి ఆవులకు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళితే అక్కడ డాక్టర్లు ఉండడం లేదు. అత్యసవర పరిస్థితుల్లో చికిత్స అందక పాడి ఆవులు చనిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వైద్యులను నియమించాలి.

– కృష్ణారెడ్డి, పాడిరైతు, జానకంపల్లి, బుక్కపట్నం మండలం

సబ్సిడీతో దాణా అందించాలి



పశు సంవర్ధక శాఖ పథకాలను పక్కాగా అమలు చేయాలి. సబ్సిడీతో దాణాను అందించాలి. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో అవసరమైన సిబ్బందిని నియమించాలి.

– దామోదరరెడ్డి, పాడిరైతు, జానకంపల్లి

సిబ్బంది కొరత ఉంది

జిల్లాలోని పశువుల ఆస్పత్రిల్లో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. మందుల కొరత లేదు. కృత్రిమ గర్భధారణ, గాలి కుంటు టీకాలు అందుబాటులో ఉన్నాయి.

– శుభదాసు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి

క్లుప్తంగా

నిండుకుండలా పీఏబీఆర్


జలాశయంలో 5 టీఎంసీలకు చేరిన నీటి మట్టం

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) నిండుకుండలా దర్శనమిస్తోంది. మంగళవారం నాటికి 5.157 టీఎంసీలకు నీటిమట్టం చేరినట్లు డ్యాం డీఈ వెంకటరమణ తెలిపారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా 185 క్యూసెక్కులు, జీడిపల్లి జలాశయం నుంచి హంద్రీ–నీవా కాలువ ద్వారా 510 క్యూసెక్కుల చొప్పున నీరు వచ్చి చేరుతున్నట్లు వివరించారు. డ్యాంలో ఏర్పాటైన జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 585 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు 55 క్యూసెక్కులు, లీకేజీ రూపంలో 35 క్యూసెక్కులు, నీటి ఆవిరి రూపంలో 25 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందన్నారు.

మూకుమ్మడిగా హోంగార్డుల బదిలీ

మడకశిర: నియోజకవర్గంలోని వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న హోంగార్డులను ఉన్నతాధికారులు మూకుమ్మడిగా బదిలీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా30 మంది హోంగార్డులు పనిచేస్తున్నారు. ఇందులో 20 మంది వరకు బదిలీ అయ్యారు. పెనుకొండ, పరిగి, గోరంట్ల తదితర ప్రాంతాలకు వీరిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పరిపాలన సౌలభ్యంలో భాగంగా బదిలీ అయ్యారా? లేదా రాజకీయ ఒత్తిళ్లతో బదిలీ అయ్యారా అనే విషయం మిస్టరీగా మారింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పరిగి: ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాలను ఏఎస్ఐ బాలరాజు మంగళవారం వెల్లడించారు. హిందూపురం మండలం మలుగూరు వద్ద ఉన్న ఓ స్టీల్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న పరిగి మండలం యు.బసవనపల్లికి చెందిన రమేష్.. ఈ నెల 3న ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మంగళవారం రమేష్ మృతి చెందాడు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన యు.బసవనపల్లికి చెందిన సుదీప్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్యం దిశగా విద్యాభ్యాసం సాగాలి

- జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ


మాట్లాడుతున్న న్యాయమూర్తి కంపల్లె శైలజ

హిందూపురం: ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రినౌల్డ్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు షీల్డ్, మెడల్స్, ప్రశంసా పత్రాలను ఆమె ప్రదానం చేసి, మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు. ఉన్నతమైన నిర్ణయాలు, మంచి అలవాట్లతో భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ పట్టుదల, క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగించి ఉత్తమ పౌరులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో న్యాయవాది సంతోషికుమారి, పాఠశాల నిర్వాహకులు ముస్తఫా అలీఖాన్, బీబీ హాజీరా, సర్ఫరాజ్ అలీఖాన్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలంపై వీడిన మిస్టరీ


చిలమత్తూరు పీఎస్ ప్రహరీ వెలుపల పడవేసిన నిమ్మకాయలు, కుంకుమ

చిలమత్తూరు: స్థానిక పోలీసు స్టేషన్ ప్రహరీకి అనుకుని ఉన్న వెలుగు కార్యాలయ ఆవరణలో నిమ్మకాయలు, కుంకుమ, ఎర్రటి వస్త్రం పడి ఉండడం కలకలం రేపింది. క్షుద్రపూజలు జరిగాయంటూ జోరుగా చర్చ సాగింది. ఈ విషయం కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఎస్ఐ మునీర్ అహ్మద్ వివరణ ఇచ్చారు. ఆయుధపూజ రోజు స్టేషన్‌లో పూజలు నిర్వహించిన అనంతరం శుభ్రం చేసే క్రమంలో వాటిని బయట పడేసినట్లు వివరించారు.

సమష్టి కృషితోనే అక్రమ మద్యం నివారణ


సిబ్బందికి సూచనలిస్తున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

ధర్మవరం అర్బన్: సమష్టిగా దాడులు చేపట్టి అక్రమ మద్యాన్ని నివారించాలని సంబంధిత అధికారులను ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం వారు తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. నాటుసారా తయారీని పూర్తిగా నివారించాలన్నారు. కర్ణాటక మద్యం నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్ఐలు చాంద్ బాషా, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

కదిరి టౌన్: ఘర్షణ కేసులో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. కదిరిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో నివాసముంటున్న సంజన, తనకల్లు మండలం సంజీవ్ నగర్‌కు చెందిన వీరంపల్లి శారద ఒకే కుటుంబానికి చెందిన వారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 4న కదిరిలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో కలసి తల్లి అదృశ్యం

బత్తలపల్లి: భర్తతో కలసి కాపురం చేయడం ఇష్టం లేని వివాహిత తన ఇద్దరు కుమార్తెలతో కలసి కనిపించకుండా పోయింది. వివాహిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. వివరాలు.. బత్తలపల్లిలోని కోటి కాలనీలో నివాసముంటున్న గోగుల అరుణ, శ్రీనివాసులు దంపతుల పెద్ద కుమార్తె భాగ్యలక్ష్మికి పుట్టపర్తికి చెందిన కృపాకర్‌తో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మనస్పర్థల కారణంగా నెల రోజుల క్రితం తన ఇద్దరు కుమార్తెలను పిలుచుకుని భాగ్యలక్ష్మి తన పుట్టింటికి చేరుకుంది. దీంతో తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి తిరిగి భర్త వద్దకు పంపేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే భర్తతో కలసి కాపురం చేయడం ఇష్టం లేని భాగ్యలక్ష్మి... ఆరేళ్ల వయసున్న జాహ్నవి, మూడేళ్ల వయసున్న యశస్వినితో కలిసి సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరితోనూ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ద్వారా ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు బాధిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96833, 94407 96832కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రెవెన్యూ క్రీడలను విజయవంతం చేయండి

- ఆయా శాఖలు సహకారం అందించాలి
- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, (చిత్రంలో) బొప్పరాజు వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్: జిల్లాలో నవంబరు 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక–2025 ఉత్సవాలను విజయవంతం చేయాలని, ఇందుకు ఆయా శాఖలు పూర్తి సహకారం అందించాలని జిల్లా అధికారులను అనంతపురం కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. రెవెన్యూ క్రీడల నిర్వహణ అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌ఓ ఎ.మలోల, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు మూడు రోజుల పాటు స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జరగనున్నాయన్నారు. క్రీడలు సజావుగా నిర్వహించేందుకు ఆయా శాఖలు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు ఉంటే డీఆర్‌ఓతో చర్చించి పరిష్కారం పొందాలన్నారు. క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చే ఉద్యోగులకు వసతి, రవాణా సదుపాయం కల్పించాన్నారు. మూడు రోజుల పాటు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. రోజూ పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్, డీపీఓకు సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఫస్ట్ ఎయిడ్స్ కిట్లు, 108 అంబులెన్స్, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓని ఆదేశించారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడా ఉత్సవాల్లో 27 యూనిట్లు పాల్గొంటాయన్నారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. సమావేశంలో ఎఫ్ఎస్ఓ జి.రామకృష్ణారెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రాజేష్, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునరెడ్డి, రమేష్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీపీఓ నాగరాజునాయుడు, ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, గనుల శాఖ డీడీ ఆదినారాయణ, , రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దివాకర్‌రావు, సోమశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ - వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొత్తచెరువు మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన పగిరెడ్డి శంకర్‌రెడ్డి(47) కియా పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో 44వ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఘటనలో తీవ్రంగా గాయపడని శంకరరెడ్డిని స్థానికులు పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మధ్యాహ్నం శంకరరెడ్డి మృతిచెందాడు. ఆయనకు భార్య సుకన్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై కియా ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య

మడకశిర రూరల్: మండలంలోని హెచ్ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ (27) ఆత్మహత్య చేసుకున్నాడు. పెళ్లి చేసేందుకు కుటుంబసభ్యులు సంబంధాలు చూస్తున్నారు. అయితే ఏ ఒక్కటీ కుదరకపోవడంతో విరక్తి పెంచుకుని మద్యానికి బానిసయ్యాడు. ఇక తనకు పెళ్లి కాదంటూ కుటుంబసభ్యులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఇంటి సమీపంలోని చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం

ప్రశాంతి నిలయం: కుటుంబ విలువలు, బంధాల గురించి రామాయణ ద్వారా సమాజానికి చాటిచెప్పిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయమైనదని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

18న పాఠశాల స్థాయి జేవీవీ చెకుముకి సంబరాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ నెల 18న పాఠశాల స్థాయిలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీర్రాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు చేతుల మీదుగా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 35 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో ఈ సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్వహించే పరీక్షలు తర్వాత అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్న కార్యక్రమం ఇదేనన్నారు. ఈ ఏడాదిలో రాష్ట్రంలో దాదాపు 4.50 లక్షలకు పైగా విద్యార్థులు పాల్గొంటుండగా జిల్లా తరఫున 25 వేల మందికి పైగా ప్రాతినిథ్యం వహించే అవకాశముందన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రమే ఇందులో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన వారు మండల స్థాయిలో జరిగే పరీక్షలకు, అక్కడ ఎంపికైన వారు జిల్లా స్థాయి, అక్కడి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణయ్య, కోటేశ్వరప్ప, జేవీవీ నగర కార్యదర్శి ఎస్.తిరుపాల్, కోశాధికారి ఎం.రామిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం


శ్రీహరి (ఫైల్)

ముదిగుబ్బ: మండలంలోని దొరిగిల్లు క్వార్టర్స్‌లో నివాముంటున్న శ్రీహరి (25) ఆత్మహత్య చేసుకున్నాడు. సోమశేఖర్, కళావతి దంపతులకు ఇద్దరు కుమారులు, వీరిలో ఒకరైన శ్రీహరి బొలెరో వాహనం పెట్టుకుని అరటి కాయల వ్యాపారం చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


గిరిజనుడిపై ఎస్ఐ ప్రతాపం

సోమందేపల్లి: స్థానిక పీఎస్ ఎస్ఐ రమేష్‌బాబు తనపై చెయ్యి చేసుకున్నాడని బాధితుడు అశ్వత్థనాయక్ ఆరోపించాడు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత నెల 11న తన భార్య నగదు, బంగారు నగలు తీసుకుని వెళ్లిపోయిందని, ఈ విషయంగా అప్పట్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. అయితే స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో సోమవారం డీఎస్పీ నర్సింగప్పకు ఫిర్యాదు చేశానన్నారు. ఎస్ఐను కలిస్తే సమస్యకు పరిష్కారం చూపుతారని డీఎస్పీ చేసిన సూచన మేరకు తాను మంగళవారం ఉదయం ఎస్ఐను కలిస్తే చెయ్యి చేసుకోవడంతో గాయపడి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు వివరించాడు.

వైభవంగా చింతల రాయుడి కల్యాణం


రథోత్సవంలో కళాకారుల సందడి

- చిరుజల్లుల నడుమ రథోత్సవం


కల్యాణ వేదికపై కొలువుదీరిన భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి


ఆకట్టుకుంటున్న చిన్నారుల కోలాటం


రథంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

తాడిపత్రి రూరల్: స్థానిక చింతల వేంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం తరఫున మంగళ వాయిద్యాలతో పట్టు వస్త్రాలను ఆలయానికి చేర్చారు. చింతల వేంకటరమణస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపైకి చేర్చి ప్రధాన అర్చకుడు మురళీస్వామి ఆధ్వర్యంలో ఆశ్వయుజ పౌర్ణమి ఘడియల్లో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని గాం. దీకట్ట నుంచి రథోత్సవం ప్రారంభమైన కొద్దిసేపటికే ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. జల్లుల నడుమ గోవింద నామస్మరణతో భక్తులు రథాన్ని లాగుతూ పరవశించిపోయారు. రథం ముందు భాగంలో వందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. వివిధ వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు.